క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

యల్లనూరు: మండలంలోని దంతలపల్లి, కొత్తపల్లి, నీర్జాంపల్లి, లక్షుంపల్లి గ్రామాల్లో గురువారం ఉదయం 8 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, జడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

నెట్టికంటి ఆలయ ఈఓగా గురుప్రసాద్



గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానం కార్యనిర్వహణ అధికారిగా పట్టెం గురుప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జ్ ఈఓగా ఉన్న డీ వెంకటేశ్వరరెడ్డిని కర్నూలు జిల్లా దేవాదాయ శాఖ నగల పరిశీలన అధికారిగా పంపారు. పాలక మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి పథంలో నిలుపతానని కొత్త ఈఓ తెలిపారు.

పెద్దపప్పూరు ఎస్‌ఐగా శరత్‌చంద్ర



పెద్దపప్పూరు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఎస్‌ఐగా శరత్‌చంద్ర బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ ఖాజాహుస్సేన్‌ను అనంతపురం వీఆర్‌కు వెళ్లారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో వీఆర్‌లో ఉన్న శరత్‌చంద్ర బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రజల సహకారంతో శాంతిభద్రతలు పరిరక్షిస్తామన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎక్సలెన్స్ అవార్డు

గుంతకల్లుటౌన్: న్యాక్ ఎ గ్రేడ్ గుర్తింపు పొందిన ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రసస్వాద ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. మంగళవారం విజయవాడలో ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖమంత్రి బొత్ససత్యనారాయణ, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి తదితరులు కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జ్ఞానేశ్వర్, ఐక్యూఏసి కోఆర్డినేటర్ టి.జితేంద్రకు రసస్వాద ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ అవార్డును అందజేసి సత్కరించారు. కళాశాలకు ఎక్సలెన్స్ అవార్డు రావడం హర్షణీయమని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మయ్య, అధ్యాపకులు తెలియజేశారు.

జూదరుల అరెస్టు

యల్లనూరు: యల్లనూరు పరిసర ప్రాంతాల్లో బుధవారం ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి రూ.3,100 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

డిస్క్‌త్రోలో శింగనమల విద్యార్థి ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థి బోయ కార్తీక్

శింగనమల: అనంతపురం ఆర్ట్స్ కాలేజీలో బుధవారం ఉమ్మడి అనంతపురం జిల్లా స్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ డిస్క్‌త్రో అండర్-14 విభాగంలో శింగనమల జడ్పీ హైస్కూల్ విద్యార్థి బోయ కార్తీక్ ప్రతిభ చాటాడు. కార్తీక్ త్వరలో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటాడని హెచ్‌ఎం సుజాతమ్మ, పీడీ నందకుమార్ తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: కొర్రపాడులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు బుధవారం వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ మండల కన్వీనర్ వరికూటి కాటమయ్య భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కాటమయ్య మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగ నిర్మాణం ద్వారా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు గంగరాజు, నాగభూషణ, గుండప్ప, నాగరాజు, ఆదినారాయణ, ఆదెప్ప, నీలకంఠ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యమే లక్ష్యం

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



మందులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

బుక్కరాయసముద్రం: పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సచివాలయం-5 పరిధిలో సర్పంచ్ పార్వతి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. ఎమ్మెల్యే ముందుగా శిబిరంలో ఏర్పాటు చేసిన వివిధ విభాగాలను పరిశీలించారు. పేదలకు అందించే వైద్య సేవల వివరాలను డాక్టర్లతో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు గ్రామాల్లోనే మెరుగైన వైద్యం అందించేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారన్నారు. స్పెషలిస్టు డాక్టర్లతో పేదలకు వైద్య పరీక్షలు చేయించడంతో పాటు అక్కడికక్కడే మందులు అందించేలా ఏర్పాట్లు చేశారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు ఒక వరం లాంటిదన్నారు. ప్రతి ఒక్కరూ వైద్య సేవలను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వైద్యులు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. జెడ్పీటీసీ భాస్కర్, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ తేజోత్స్న, ఎంపీటీసీలు కాలువ వెంకటలక్ష్మి, సుజాత, ఉప సర్పంచ్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: లక్ష్మంపల్లి గ్రామ సచివాలయం వద్ద బుధవారంజగనన్న ఆరోగ్య సురక్షకార్యక్రమం నిర్వహించారు. వైద్యులు శ్రీనివాసబాబు, శ్రీనివాసులరెడ్డి, అమర్‌నాథ్ 311 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. తహసీల్దార్ నాగభూషణ, ఎంపీడీఓ కుళ్ళాయిస్వామి పాల్గొన్నారు.

పామిడి: రామరాజుపల్లి గ్రామంలో బుధవారం సర్పంచ్ డీసీ ముత్యాల్‌రెడ్డి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. వైద్యులు సుధాకర్, అనిల్‌కుమార్, అనిత, హరిత, సుధాకర్, రాజశేఖర్ 298 మందికి పరీక్షలు చేసి మందులు అందించారు. జెడ్పీటీసీ ఎల్ శోభారాణి, భోగాతి మురళీమోహన్ రెడ్డి, మండల స్పెషలాఫీసర్ అప్పాజీరావు, ఈఓఆర్డీ బీవీ శశికళ పాల్గొన్నారు.

నార్పల: మండల కేంద్రంలోని ఉయ్యాలకుంట కాలనీలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. వైల్యులు రోగులకు పరీక్షలు చేసి మందులు అందించారు. తహసీల్దార్ హరి కుమార్,ఎంపీడీఓ దివాకర్, సర్పంచు మన్నీల సుప్రియ,ఎంపీటీసీ బాలనాగి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పుట్లూరు: కోమటికుంట్లలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. కోమటికుంట్ల, చిన్నమల్లేపల్లి, గరుగుచింతలపల్లి గ్రామాలకు చెందిన 263 మందికి పరీక్షలు చేసి మందులు అందించినట్లు వైద్యాధికారి శ్రీవాణి తెలిపారు. ఎంపీడీఓ యోగానందరెడ్డి, తహసీల్దార్ మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: తొండపాడు గ్రామంలో బుధవారం సర్పంచు రాధమ్మ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. బేతాపల్లి పీహెచ్‌సీ వైద్యులు సందీప్ యాదవ్, దేవేంద్ర నాయక్ రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఎంపీపీ విశాలాక్షి, ఎంపీడీఓ శివాజీరెడ్డి, సూపర్‌వైజర్ పుష్పావతి, గ్రామ కార్యదర్శి ధనలక్ష్మి పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: చిన్నపోలమడ గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వైద్యులు సుమన్, లావణ్య గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారం స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. సర్పంచ్ నాగేంద్రమ్మ, ఎంపీటీసీ స్రవంతి, ప్రోగ్రాం అధికారి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు: గడ్డంవారిపల్లి సచివాలయం వద్ద బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి, సర్పంచు గంగరాజు అధ్యక్షతన జరిగింది. మల్లాగుండ్ల, గడ్డంవారిపల్లి, లింగారెడ్డిపల్లి గ్రామాలకు చెందిన 210 మంది రోగులకు వైద్యులు శివసాయి, నాగార్జునగుప్త, సాయినాగశ్రీలు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. తహసీల్దారు సుమతి తదితరులు పాల్గొన్నారు.

యాడికి: లక్షుంపల్లె గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. వైద్యులు అప్పయ్య, పరమేశ్వర, లక్ష్మీసంధ్య , పవన్‌కుమార్ 425మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. తహసీల్దార్ అలెగ్జాండర్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, గ్రామ సర్పంచు పద్మనాభరెడ్డి, ఎంఈఓ-2 ధనలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

గార్లదిన్నె: కనంపల్లిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఎంపీపీ వెంకట నారాయణ, తహసీల్దార్ ఉషారాణి, ఎంపీడీఓ విజయభాస్కర్, సర్పంచ్ సంజమ్మ పాల్గొన్నారు.

షెడ్లలో తరగతులు నిర్వహిస్తే చర్యలు

గుంతకల్లు రూరల్: దసరా సెలవుల తర్వాత రేకులషెడ్లు, బండల షెడ్లలో తరగతులు నిర్వహిస్తే పాఠశాలల అనుమతులు రద్దు చేస్తామని ఆర్డీఓ రవీంద్ర హెచ్చరించారు. ఇటీవల ఓ ప్రైవేటు పాఠశాలలో బండ పడి చిన్నారి మృతి చెందిన విషయం విదితమే. బుధవారం ఎంఈవో మస్తాన్ రావు, ఎంఈవో 2 సుబ్బరాయుడుతో కలిసి స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీవో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

తాడిపత్రి అర్బన్: రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు తాడిపత్రికి చెందిన అక్షయ అనే విద్యార్థిని ఎంపికై ంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం అనంతపురంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో పద్మవాణి హైస్కూల్ విద్యార్థిని అక్షయ ప్రతిభ కనబరిచడంతో నిర్వాహకులు రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారని పాఠశాల హెచ్‌ఎం నాగపేరయ్య తెలిపారు. బుధవారం విద్యార్థినిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉపాధి కల్పనే లక్ష్యంగా జాబ్‌మేళా

గుంతకల్లు: నిరుద్యోగుల ఉపాధి కల్పనే ధ్యేయంగా జాబ్ మేళాను ఏర్పాటు చేసినట్లు శ్రీశంకరనందగిరి స్వామి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేసీ హరి తెలిపారు. బుధవారం కళాశాలలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ జాకీర్, క్లస్టర్ మేనేజర్లు గురుప్రకాష్, శివకుమార్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలో ఎంపికైన వారిని గురువారం హెచ్‌ఆర్ రౌండ్ తరువాత ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు వారు ప్రకటించారు. ప్రిన్సిపాల్ గోపాల్ పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



వృద్ధురాలి సమస్య వింటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి
- చుక్కలూరులో సచివాలయం, ఆర్బీకే ప్రారంభం

తాడిపత్రిటౌన్: జగనన్న పాలనలో ఇంటి ముంగిటే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. మండలంలోని చుక్కలూరు గ్రామంలో బుధవారం నూతనంగా నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకే భవనాలను ఆయన ప్రారంభించారు. అంతకు ముందు ఆయనకు గ్రామస్తులు బాణాసంచా పేలుస్తూ ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు పొందాలంటే మండల కేంద్రాలకు కాళ్లు అరిగేలా తిరిగాల్సి వచ్చేదన్నారు. అప్పటి జన్మభూమి కమిటీలకు లంచాలు ఇస్తేగాని ప్రభుత్వ పథకం అందేది కాదన్నారు. కానీ నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నారు. గ్రామాలలో సచివాలయాలతో అన్ని పనులు పూర్తవుతున్నాయన్నారు. ఎలాంటి పథకమైనా వలంటీర్ల ద్వారా గడప వద్దనే అందుతోందన్నారు. రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాలు, సబ్సిడీతో పరికరాలు లభిస్తున్నాయన్నారు. గిట్టుబాటు ధరతోనే ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా పంటలు కొనుగోలు చేస్తోందన్నారు. రైతులకు పంటల సాగులో ఆర్బీకేల సిబ్బంది సూచనలందిస్తున్నారని గుర్తు చేశారు. రైతులకు పెట్టుబడి సాయం కోసం వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ఏటా రూ.13,500 ఆర్థిసాయం అందిస్తున్నామన్నారు. పైసా ఖర్చు లేకుండా పంటల బీమా అందుతోందని తెలిపారు. కుల,మత, వర్గ, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలెం లలితకుమారి, జెడ్పీటీసీ రమణమ్మ, ఎంపీటీసీ మేరి, భాస్కర్, సుధీర్, వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు రంగనాథ్‌రెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు, తాడిపత్రి పట్టణ కన్వీనర్ జావెద్ తదితరులు పాల్గొన్నారు.

ఆప్యాయంగా పలకరిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ..

తాడిపత్రి అర్బన్: ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి. బుధవారం మెయిన్‌బజార్, ఓంశాంతినగర్, శివాలయం వీధుల్లో ఇంటింటికీ తిరిగారు. సమస్యలు ఏవైనా ఉంటే చెప్పాలని వెంటనే వాటిని పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక్క ఏపీలోనే నవరత్న పథకాల పేరుతో అనేక పథకాలను అందించిన ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కిందన్నారు. గతంలో టీడీపీ హయాంలో కేవలం ఆ పార్టీ నాయకులు, మద్దతుదారులకు మాత్రమే సంక్షేమ పథకాలు అందేవని, కానీ నేడు పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని ఎమ్మెల్యే గుర్తు చేశారు. అన్ని వర్గాల వారికి ఏదో ఒక రూపంలో లబ్ధి చేకూర్చుతున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టి తిరిగి వైఎస్.జగన్‌ను సీఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కమిషనర్ జి.రవి, డీఈ వెంకటసుబ్బయ్య, నాయకులు అంబటి రాఘవరెడ్డి, సూర్యప్రభాకర్‌బాబు, లక్ష్మీరంగయ్య, అయూబ్, సచివాలయ కార్యదర్శులు, వాలంటీర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సమస్యలు తెలుసుకుంటున్న కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి

యాడికి: పార్టీల కతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం కోనుప్పలపాడు గ్రామంలో జన చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ రెడ్డి గ్రామంలోని ప్రతి ఇంటి వద్దకు వెళ్లి జగనన్న ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి గడపకు ప్రభుత్వం అందించిన సంక్షేమ లబ్ధిని వివరించారు. స్థానికులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, వైస్ ఎంపీపీ చెన్నప్ప, నగరూరు సర్పంచు రుక్మాందర రెడ్డి, నాయకులు కోనా వెంకటశివారెడ్డి, కోనా జగదీశ్వరరెడ్డి, కోనా దేవనాథరెడ్డి, బాలగంగయ్య యాదవ్, రవి కుమార్ రెడ్డి, రామకేశవ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కిరణ్ కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి యాడికి సింగిల్ విండో అధ్యక్షుడు కొట్టే వెంకటరామిరెడ్డి, కొట్టే వాసుదేవరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొట్టే రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు



సుధాకర్(ఫైల్)



జవాన్ అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: ముంటి మడుగుకు చెందిన ఆర్మీ జవాన్ అంత్యక్రియలు బుధవారం ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన సుధాకర్27) జమ్మూ కశ్మీర్‌లో జవాన్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల సెలవుపై సొంత గ్రామానికి వచ్చారు. ఈ నెల 6న సుధాకర్ అనంతపురం నుంచి బైక్‌పై వస్తుండగా 44వ జాతీయ రహదారిపై బి.కొత్తపల్లి వద్ద అదుపు తప్పి కిందపడ్డాడు. స్థానికులు క్షతగాత్రుడ్ని అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తర్వాత వైద్యుల సూచన మేరకు బెంగళూరుకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో అక్కడే మృతి చెందాడు.

సజావుగా వాహనాల వేలం

గుత్తి: పట్టణంలోని సివిల్, సెబ్ పోలీసు స్టేషన్లలో బుధవారం వాహనాల వేలం పాట సజావుగా జరిగింది. సెబ్ పోలీసు స్టేషన్‌లో రెండు ద్విచక్ర వాహనాలను వేలం వేయగా రూ.17,110 ఆదాయం లభించింది. సివిల్ పోలీసు స్టేషన్‌లో ఆరు ద్విచక్ర వాహనాలకు రూ.82,718 ఆదాయం వచ్చింది. సీఐ వెంకటరామిరెడ్డి, ఏఎస్‌ఐ నాగమాణిక్యం, సెబ్ సీఐ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న డీఎస్పీ గంగయ్య

గుత్తి: ర్యాగింగ్ చట్ట రీత్యా నేరమని తాడిపత్రి డీఎస్పీ గంగయ్య అన్నారు. పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో బుధవారం యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. ర్యాగింగ్, మత్తు పదార్థాల జోలికి వెళ్లకుంటే భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవచ్చాన్నారు. మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల జరిగే పరిణామాలు, ర్యాగింగ్‌తో కలిగే నష్టాలను వివరించారు. గేట్స్ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వీకే వాణి, ప్రిన్సిపాల్ సురయ, ఎస్‌ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: కోనాపురం సమీపంలో ఏర్పాటు చేసిన పేలుడు పదార్థాల నిల్వ కేంద్రాన్ని తాడిపత్రి డీఎస్పీ సీఎం గంగయ్య బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లైసెన్స్ కాల పరిమితి, రికార్డులను పరిశీలించారు. గోడౌన్ వద్ద ప్రమాద హెచ్చరికలను తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని ఆదేశించారు. డీఎస్పీ వెంట యాడికి సీఐ శంకర్‌రెడ్డి ఉన్నారు.

నేడు జగనన్న కాలనీలో సామూహిక గృహప్రవేశాలు



సజ్జలదిన్నె సమీపంలో వెలసిన జగనన్న కాలనీ

తాడిపత్రిటౌన్: సజ్జలదిన్నె గ్రామ సమీపంలోని జగనన్న కాలనీలో గురువారం సామూహిక గృహ ప్రవేశాలు జరగనున్నాయి. తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై గృహాలను ప్రారంభించనున్నారు. తాడిపత్రి అర్బన్ పరిధిలోని 336 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లను మంజూరు చేసింది. కాలనీలో రోడ్లు, తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించింది. ఈక్రమంలో ఇప్పటికే 168 మంది ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకున్నారు. మిగిలిన ఇళ్లు కూడా త్వరలోనే పూర్తి కానున్నాయని హౌసింగ్ అధికారులు చెబుతున్నారు. సొంతింటి కల నెరవేరడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సెల్‌ఫోన్లకు బానిసలు కావొద్దు

తాడిపత్రి అర్బన్: విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిసలు కావొద్దని సీఐ హమీద్‌ఖాన్ సూచించారు. బుధవారం సాయంత్రం యల్లనూరు రోడ్డులోని టార్గెట్ పాఠశాలలోని విద్యార్థులకు సెల్‌ఫోన్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలు, నష్టాల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా స్మార్ట్‌ఫోన్ నుంచి వచ్చే రేడియేషన్ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందన్నారు. చిన్నారులకు భౌతిక సమాజాన్ని దూరం చేయడంలో స్మార్ట్ ఫోన్ కీలక పాత్ర పోషిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం

బుక్కరాయసముద్రం: జంతులూరు వద్దనున్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్‌లో బుధవారం కమాండెంట్ గంగాధర్ రావు కానిస్టేబుల్ ఉదయ్ భాస్కర్ భార్య దీపికకు అడిషనల్ కార్పస్ ఫండ్ కింద రూ.50 వేల చెక్కును అందించారు. ఉదయ్‌భాస్కర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కానిస్టేబుల్ కుటుంబానికి ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా అదుకుంటామని కమాండెంట్ తెలిపారు. దీపికకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం వచ్చేలా కృషి చేస్తామన్నారు. బెటాలియన్ పోలీసు అసోసియేషన్ అధ్యక్షులు పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

హెచ్.సోదనపల్లిలో సుఖప్రసవం

నార్పల: హెచ్.సోదనపల్లి సచివాలయ ఏఎస్‌ఎం వనిత బుధవారం గ్రామంలోనే ఓ గర్భిణికి సుఖ ప్రసవం చేసింది. వివరాలు.. గ్రామానికి చెందిన రాజమ్మకు ఉదయం పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. సమాచారం అందుకున్న ఏఎస్‌ఎం వనతి, ఆశా వర్కర్ పద్మావతి రాజమ్మ ఇంటికి చేరుకుని సుఖ ప్రసవం చేశారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు ఏఎస్‌ఎం తెలిపారు. ఈసందర్భంగా గ్రామస్తులు ఏఎస్‌ఎంను అభినందించారు.

సీజనల్ వ్యాధులపై చర్యలు చేపట్టండి

గుంతకల్లుటౌన్: పట్టణంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సచివాలయ హెల్త్, శానిటేషన్ సెక్రటరీలకు సూచించారు. బుధవారం కౌన్సిల్ హాల్‌లో కమిషనర్ సచివాలయ కార్యదర్శులు, కమ్యూనిటీ టాయిలెట్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. పట్టణంలోని పబ్లిక్, కమ్యూనిటీ టాయిలెట్లు, పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని నిర్వాహకులను ఆదేశించారు. కాలనీల్లో ఎక్కడా చెత్తకుప్పలు కనిపించరాదని, డ్రైనేజీలను కూడా ఎప్పటికప్పుడు పీహెచ్ వర్కర్ల చేత క్లియర్ చేయించాలన్నారు. వార్డుల్లో ఇంటింటా సర్వే నిర్వహిస్తూ ఎవరైనా జ్వరాల బారిన పడితే వెంటనే వారికి సమీపంలోని ప్రభుత్వ వైద్యశాల్లో వైద్యసేవలందించాలని ఏఎస్‌ఎంలకు సూచించారు. అసిస్టెంట్ కమిషనర్ లావణ్య, ఎంఈ గురప్పయాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ రామలింగప్ప, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వేణుగోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బ్యారికేడ్ల అందజేత

పెద్దవడుగూరు: అమిగోస్ మైన్స్, మినరల్స్ కంపెనీ పెద్దవడుగూరు పోలీసులకు 10 బ్యారికేడ్లను ఉచితంగా అందజేసినట్లు సీఐ శంకర్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. బ్యారికేడ్ల విలువ రూ.1.5 లక్షలుంటుందన్నారు.

ఉపా, ఎన్‌ఐఏ చట్టాలు రద్దు చేయాలి

గుంతకల్లుటౌన్: రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న ఉపా, ఎన్‌ఐఏ చట్టాలను రద్దు చేసి పౌర హక్కులను కాపాడాలని ఐఎఫ్‌టీయూ(భారత కార్మిక సంఘాల సమాఖ్య) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ పొట్టిశ్రీరాములు సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. పౌర, ప్రజాస్వామిక, హక్కుల సంఘాలపై ఎన్‌ఐఏ దాడులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఓపీడీఆర్ జిల్లా కమిటీ సభ్యుడు రఘునాథరెడ్డి, ఐఎఫ్టీయూ పట్టణ అధ్యక్షుడు రామాంజనేయులు, పీఓడబ్ల్యూ కార్యదర్శి ఆశాబీ పాల్గొన్నారు.

జోగినులకు నిత్యావసరాల అందజేత



నిత్యావసరాలను అందిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: ఏపీ సంచారజాతుల మహిళా, ప్రగతి శీల సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణ, మండలంలోని 80 మంది జోగినులు, బసివినులకు బియ్యంతో పాటు నిత్యావసరాలను అందజేశారు. బుధవారం స్థానిక మహిళా సంఘం కార్యాలయంలో మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఇందిరా దేవి, జోగిని,బసివినుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఎల్లమ్మ, సంచారజాతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసులు మాట్లాడారు. జోగినులను సమాజం గౌరవించాలని, వారిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. టీపీఆర్ ట్రస్ట్ అధ్యక్షుడు తలారి పరుశురాముడు, సంచారజాతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుళ్లాయప్ప, మల్లికార్జున, మహిళా సంఘం నేతలు జానకి, రత్నమ్మ, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పశువ్యాధులపై అవగాహన అవసరం

బుక్కరాయసముద్రం: పశువుల్లో సంభవించే వ్యాధులపై రైతులకు అవగాహన అవసరమని కేవీకే పశుశాస్త్రవేత్త డాక్టర్ మాధవి, వెటర్నరీ డాక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కేవీకే ఆధ్వర్యంలో శింగమల మండలం ఈస్ట్ నరసాపురంలో పశు వ్యాధుల నివారణ చర్యలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువుల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం పశువులకు చికిత్సలు నిర్వహించారు. రైతులకు ఉచితంగా పశువుల మందులను అందజేశారు.